క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వర స్వామి పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలోని వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల బృందం స్వామివారిని విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన లొల్ల వెంకటరమణ, వెంకటలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ సంయుక్త సౌజన్యంతో దూరపు ప్రాంతాల భక్తులకు అన్నదానం చేశారు. గ్రామంతో పాటు పడమరఖండ్రిక, కోరుమిల్లి, టేకి, కపిలేశ్వరపురం, వెదురుమూడి, తాతపూడి తదితర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కోరుమిల్లిలో పారిశుద్ధ్య పనులు



కోరుమిల్లిలో ముగ్గురు జల్లిస్తున్న పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి గ్రామంలో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ కొండలరావు ఆదేశాలపై పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు ఆధ్వర్యంలోని పారిశుద్ధ్య కార్మికులు వీధుల్లోని చెత్తను తొలగించారు. డ్రెయిన్లలో పూడిక తీశారు. ముగ్గు జల్లి పారిశుద్ధ్య ప్రాధాన్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

లొల్లలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామంలో సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శనివారం నిర్వహించారు. చెరుకువాడకు చెందిన ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు, కేశవరామాచార్యులు, శ్యామసుందరం తదితరుల అర్చకత్వంలో పూజాదికాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని పూజాదికాలు నిర్వహించారు. గారపాటి తమ్మయ్య, శేషారత్నం దంపతులు పీటలపై కూర్చుని పూజాలు చేశారు. ఈ సందర్భంగా సాముహిక పూజలు జరిగాయి. పూజల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు వైట్ల సతీష్, మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, వైఎస్సార్ సీపీ నేత చేవా సత్యనారాయణ, జనసేన నేతలు గంధం పల్లంరాజు, రాయపురెడ్డి, గరగ సోమన్న పాల్గొన్నారు.

జూనియర్ కళశాలలో ఫ్రెషర్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకుడు

రాయవరం: ప్రతీ విద్యార్థీ లక్ష్యాన్ని నిర్ణయించుకుని, సాధన దిశగా విద్యాభ్యాసం చేయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు అన్నారు. ఆ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విజయాలు సాధించిన శాస్త్రవేత్తలు, గొప్ప గొప్ప నాయకులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థి దశలో ప్రతీ నిమిషం విలువైనదే అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డీవీవీ నాగేశ్వరరెడ్డి, పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకుంటే సామాన్యులు కూడా అసామాన్యులుగా ఎదుగుతారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఫస్టియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సెకండియర్ విద్యార్థులు కార్యక్రమాలు నిర్వహించారు.

నిత్యావసరాల పంపిణీ



శేరిలంకలో బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న బాల వికాస సంస్థ సభ్యులు

కె.గంగవరం: మండలంలోని శేరిలంకలో శనివారం వరద బాధిత కుటుంబాలకు దాతలు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అమెజాన్, డొనేట్ కార్డు సంస్థల ఆర్థిక సౌజన్యంతో గ్రామంలోని 500 మంది కుటుంబాలకు నిత్యావసరాలు అందించారు. బాల వికాస సంస్థ ప్రోగ్రాం మేనేజర్ శివరామ్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా అమెజాన్ కంపెనీ ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులను ఆదుకోవడానికి బాల వికాస సంస్థ ద్వారా సహాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ అబ్బులు, కిరణ్, శేరిలంకకు చెందిన డేనియల్ రాజ్, మార్క్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రయాణం భారం...
తరగతులకు దూరం

- ఫుట్‌బోర్డు ప్రయాణం తప్పేదెన్నడో..?
- అరకొర ఆర్టీసీ బస్సులతో విద్యార్థులకు అవస్థలు
- అదనపు బస్సులు నడపాలని విజ్ఞప్తి



ఫుట్‌బోర్డులపై ప్రయాణం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

రాయవరం: గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువులకు రోజూ ఇంటి నుంచి దూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుంది. వీరంతా కళాశాలలకు చేరుకోవడానికి విధిగా రోజూ ఆర్టీసీ బస్సులను ఆశ్రయించాల్సిందే. అరకొరగా నడుపుతున్న ఆర్టీసీ బస్సుల వల్ల విద్యార్థులు రోజూ తరగతులకు దూరం కావడమే కాకుండా భారంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది.

సమీప పట్టణాలకు వెళ్లాల్సిందే..

క్లస్టర్ లోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలోని 120 గ్రామాల ప్రజలు రోజూ సమీపంలోని వివిధ కళాశాలలకు ఉన్నత విద్య అభ్యసించేందుకు వెళ్లాల్సి వస్తోంది. ఈ మండలాల ప్రజలు రోజూ మండపేట, రామచంద్రపురం, ద్రాక్షారామ, కాకినాడ, యానం, అనపర్తి తదితర దూర ప్రాంతాలకు వెళ్లి కళాశాల విద్య అభ్యసిస్తున్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు ముఖ్యంగా విద్యార్థినులు కళాశాలకు చేరుకునేందుకు మరో మార్గం లేక ఆర్టీసీ బస్సులపై ప్రయాణం చేస్తున్నారు. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల మధ్యలో వీరంతా ఆయా గ్రామాల బస్‌స్టాప్‌లకు చేరుకుంటారు. రామచంద్రపురం డిపో బస్సులు రామచంద్రపురం–అనపర్తి షటిల్ సర్వీసులుగా తిరుగుతున్నాయి. అలాగే రామచంద్రపురం డిపో నుంచి మసకపల్లి, కూళ్ల, వాకతిప్ప తదితర గ్రామాలకు బస్సులు తిరుగుతున్నాయి. మారుమూల గ్రామాల విద్యార్థినులు కళాశాలలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులపైనే ప్రయాణిస్తున్నారు. అనపర్తి నుంచి బయలుదేరే బస్సు బలభద్రపురం, తొస్సిపూడి, కొమరిపాలెం గ్రామాలకు వచ్చేసరికి ప్రయాణికులు, విద్యార్థులతో కిక్కిరిసిపోతుంది. రాయవరంలో అతికష్టం మీద విద్యార్థులు బస్సు ఎక్కాల్సిన పరిస్థితి. విద్యార్థులు అతికష్టం మీద బస్సు ఎక్కినా విద్యార్థినులు మాత్రం బస్సు ఎక్కలేక నిస్సహాంగా ఉండిపోతున్నారు. బస్సు లొల్ల, సోమేశ్వరం చేరేసరికి ప్రయాణికులు కిక్కిరిసిపోతున్నారు.ఈ పరిస్థితుల్లో డ్రైవర్ బస్సును కూడా ఆపకుండా వెళ్లిపోతున్నట్టు పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి పలు రూట్లలో ఉంది.

తప్పని ఫుట్‌బోర్డు ప్రయాణం..

ఆర్టీసీ బస్సులో విద్యార్థులు, ప్రయాణికులు ఒకరినొకరు ఒరుసుకుని ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రయాణికులు, విద్యార్థులతో కిక్కిరిసిపోవడంతో విద్యార్థులు డ్రైవర్ పక్కనున్న బానెట్ పైన, ఫుట్‌ఫాత్‌పైన ప్రయాణించి కళాశాలకు చేరుకోవాల్సి వస్తోంది. ఫుట్‌బోర్డుపై ప్రయాణం ప్రమాదం అని తెలిసినా బస్సు దాటిపోతే తరగతులకు దూరమవ్వాల్సి రావడంతో ఈ విధంగా ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఇదే పరిస్థితిని కూర్మాపురం, కురకాళ్ళపల్లి, వెంటూరు, చెల్లూరు గ్రామాల విద్యార్థులు కూడా ఎదుర్కొంటున్నారు. కె.గంగవరం మండలం వాకతిప్ప నుంచి రామచంద్రపురం వెళ్లే బస్సు కూడా ప్రయాణికులతో కిటకిటలాడుతుంది. ఈ బస్సు కురకాళ్లపల్లి వచ్చే సరికే ప్రయాణికులతో రద్దీగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగే కె.గంగవరం మండలంలోని మసకపల్లి, భట్లపాలిక, పేకేరు, దంగేరు తదితర గ్రామాల నుంచి ద్రాక్షారామ, రామచంద్రపురం పట్టణానికి వచ్చే విద్యార్థులు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కిక్కిరిసిన ప్రయాణికులతో బస్సు ఎక్కలేని పరిస్థితుల్లో ఒక్కోసారి తాము కళాశాలలకు గైర్హాజరవ్వాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి సకాలంలో తరగతులకు హాజరయ్యేందుకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. అరకొర బస్సులతో తాము పడుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతూ గతంలో పలుమార్లు ధర్నాకు దిగినా ఆర్టీసీ యాజమాన్యం స్పందించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలన చేస్తాం



గ్రామాల నుంచి కళాశాలలకు ఉదయం, సాయంత్రం సమయాల్లో రాకపోకలు అధికంగానే ఉంటాయి. ఆ సమయంలో విద్యార్థులు కళాశాలలకు వచ్చే సమయంలో ప్రయాణికులు, విద్యార్థులతో కొంత రష్‌గా ఉంటుంది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా రష్‌గా ఉన్న రూట్లలో అదనపు సర్వీసులు నడిపేలా తప్పనిసరిగా పరిశీలన చేసి, సమస్యను అధిగమించే ప్రయత్నం చేస్తాం.

– కె.వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్, రామచంద్రపురం

విద్యార్థులు సమాజాభివృద్ధికి పాటు పడాలి

రామచంద్రపురం: విద్యార్థులు సమాజాభివృద్ధికి దోహదపడాలని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వీఎస్‌ఎం కళాశాల సెమినార్ హాలులో మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం మాదకద్రవ్యాలు, మత్తు పానీయాలు నివారణపై జరిగిన సదస్సులో న్యాయమూర్తి ప్రసంగించారు. విద్యార్థి దశలో యువత పెడదోవపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల అభివృద్ధికి తల్లిదండ్రులు పడే కష్టాలను అర్థం చేసుకోవాలన్నారు. విద్యార్థులు న్యాయశాస్త్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి వాడకంతో ఆరోగ్యాలు పాడు చేసుకోవడమే కాకుండా హింసకు కూడా పాల్పడుతున్నారన్నారు. చిన్న చిన్న తగాదాలకు కూడా కోర్టులను ఆశ్రయిస్తున్నారని దీంతో కోర్టులలో కేసుల సంఖ్య పెరిగిపోతుందన్నారు. సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్ లను వినియోగించుకోవాలని, రాజీమార్గమే రాజమార్గమని ఆయన అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీ మోహన్ వెంకటరమణ, సాయిప్రసాద్ వాడ్రేవు, ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ లోక్ అదాలత్ సభ్యుడు దొమ్మలపాటి సత్యనారాయణ, వీఎస్‌ఎం విద్యా సంస్థల ఉపాధ్యక్షులు ఎంఎస్ఎన్ మూర్తి, కళాశాల అధ్యాపకులు వి.రవీంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మందులు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తులు తదితరులు

రామచంద్రపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్, ఫ్లూ జ్వరాలు ప్రబలుతాయని, దోమలను అరికట్టేందుకు ఎవరికి వారు చర్యలు తీసుకోవాలని అన్నారు. అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వి. నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ రోగాలు బారిన పడకుండా ప్రజలు పరిశుభ్రంగా ఉంటూ తమ పరిసరాలను, ఇళ్లను, కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి వైద్యులు హేమ సుధీర్ రోగులకు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం రోగులకు న్యాయమూర్తులు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, సాయి ప్రసాద్ వాడ్రేవు, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, లోక్ అదాలత్ సభ్యులు దొమ్మలపాటి సత్యనారాయణ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యంగా పనులు పూర్తి చేయండి



మహిళా భవనాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కాంట్రాక్టర్లను ఆదేశించారు. స్థానిక 20వ వార్డు వైఎస్సార్ కాలనీలో నిర్మించిన మహిళా స్వశక్తి భవనం ప్రహరీ , భవనం మరమ్మతు పనులకు రూ.27 లక్షల మున్సిపల్ నిధులు కేటాయించారు. ఈ నిర్మాణ పనులను శనివారం మొదలుపెట్టగా చైర్‌పర్సన్ దుర్గారాణి, కమిషనర్ బొడ్డేపల్లి రాము పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ త్వరిత గతిన పనులను పూర్తి చేసి అప్పగించాలని ఆదేశించారు. చైర్‌పర్సన్‌తో పాటు డీఈ కే శ్రీనివాస్, ఏఈ పవన్‌కుమార్ ఉన్నారు.

పందుల స్వైరవిహారాన్ని అరికట్టాలి



కాజులూరులో మెయిన్‌రోడ్డుపై సంచరిస్తున్న పందులు

కాజులూరు: గ్రామంలో రోజురోజుకి పెరుగుతున్న పందుల స్వైరవిహారాన్ని అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పందుల సంచారం ద్వారా ప్రమాదకరమైన అంటు వ్యాధులు సోకుతాయని వైద్యులు సూచిస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోక పెంపకందార్లు విచక్షణా రహితంగా వాటి సంఖ్యను పెంచుతూ గ్రామంలోకి వదులుతున్నారు. అవి డ్రైనేజీల్లో పొర్లుతూ పరిసరాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. దీంతో భరించలేని దుర్వాసన వస్తూ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పందుల పెంపకాన్ని నిరోధించాలని గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బాల్యవివాహాలపై అవగాహన పెంచుకోవాలి



కోలంకలో బాలికా వివాహాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్

కాజులూరు: బాల్యవివాహాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోలంక సెక్టారు సూపర్‌వైజర్ పీవీ కల్యాణి అన్నారు. కుయ్యేరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం తాళ్లరేవు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు బాల్యవివాహాలు, మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెక్టారు సూపర్‌వైజర్ మాట్లాడుతూ అనుమతి లేకుండా బాలికలపై ఎవరు చేతులు వేసి అభ్యంతరకరంగా ప్రవర్తించినా అది నేరమే అవుతుందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్యవివాహల వలన కలిగే అనర్థాలను వివరించారు. బాల్యవివాహాలు గుర్తిస్తే అధికారులకు సమాచారం ఇచ్చే హెల్ప్‌లైన్ నంబర్లపైనా స్థానిక మహిళలకు పలు సూచనలు చేశారు. సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది ఎ.అన్నవరం, పి.నాగమణి, సూర్యావతి, సుజాత, లలిత, వరలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదును పరిశీలించిన ఏవో



రాయవరంలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో ప్రభాకర్



వెల్లలో ఈ-పంట నమోదు ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఏఓ

రాయవరం: ఈ–పంట నమోదును మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ శనివారం రాయవరంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఖరీఫ్ సాగు ఈ పంట నమోదు ప్రారంభమైనట్టు ఆయన తెలిపారు. మండలంలో 14,475 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలని, రైతులు, కౌలు రైతులు రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. పంట నమోదు చేసుకోవడం వలన పలు రకాల ఉపయోగాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా పండించిన పంటను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవడానికి, ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు కలిగినపుడు పంట నష్టపరిహారం రావడానికి, పంటల బీమా పరిహారం పొందడానికి, పంటపై తీసుకున్న రుణాలకు సున్నా వడ్డీ వర్తించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మణికంఠ, తేజలు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు ట్రయల్ రన్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్లలో శనివారం ఏవో ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఈ–పంట నమోదు కార్యక్రయం ట్రయల్ రన్ నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు సెప్టెంబర్ 15 లోపుగా తమ పంట వివరాలను ఈ–పంట యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. దీని కోసం రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం వద్ద ఆధార్ కార్డు, పాస్‌బుక్, ఫోన్ నంబరు, బ్యాంకు అకౌంట్‌ల జెరాక్స్‌లు తీసుకుని వెళ్లి తాము వేసిన పంట రకం వివరాలతో నమోదు చేయించుకుని ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ గండి సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ



పాడి రైతులకు దాణా పంపిణీ చేస్తున్న ఏడీ రామకృష్ణ తదితరులు

కె.గంగవరం: మండలంలోని మసకపల్లిలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు ఉచితంగా పశువుల దాణా పంపిణీ చేశారు. వరద ప్రభావిత గ్రామాలైన భట్లపాలిక, మసకపల్లి, సుందరపల్లి, కోట గ్రామాలకు చెందిన 352 మంది పశువులకు సంబంధించిన 1020 పాడి పశువులకు ఉచితంగా సమీకృత దాణా, మినరల్ మిక్చర్‌ను స్థానిక మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, కోనసీమ జిల్లా డిప్యూటి డైరెక్టర్ కర్నెడ మూర్తి, రామచంద్రపురం ఏడీ ఒ.రామకృష్ణ పాడిరైతులకు అందించారు. వారు మాట్లాడుతూ వరదల కారణంగా లంకల్లో ఉన్న పశువులకు మేత ఉండకపోవడం వల్ల ప్రభుత్వం రైతులకు ఉచితంగా సమీకృత దాణాను అందించిందన్నారు. జిల్లా కలెక్టర్ సకాలంలో స్పందించి పాడి రైతులకు దాణాను సమకూర్చారని ఆయన పేర్కొన్నారు. పశువుల దాణాను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. పశువైద్యులు సంయుక్తలక్ష్మి, సురేష్‌బాబు, కృష్ణార్జున్, బిందు, టీడీపీ నాయకులు చొల్లంగి ఎదుర్లియ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

30 ఏళ్ల పోరాటానికి ఫలితం ‘సుప్రీం’ తీర్పు



తాపేశ్వరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు

మండపేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ శాఖ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఉండ్రాజవరపు అర్జున్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు గురువారం తీర్పు ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని తాపేశ్వరం గ్రామంలో వైఎస్సార్ సీపీ, ఎమ్మార్పీఎస్ నాయకుడు బూరా చిన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అర్జున్, ఇతర నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మల్లవరపు వెంకట్రావు, లంక రాజేష్, తాతపూడి అభి, జిత్తుగ సిద్ధూ, రామవరపు ప్రకాష్, చెదలవాడ ప్రవీణ్ పాల్గొన్నారు.

పలు వార్డుల్లో మంత్రి సుభాష్ పర్యటన



పదో వార్డులో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: పట్టణంలోని పలు వార్డుల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 9, 10 వార్డుల్లో పర్యటించి ప్రధానమైన డ్రైనేజీ, రోడ్డు సమస్యల పరిష్కారానికి స్థానికులకు హామీ ఇచ్చారు. 10వ వార్డులో నిర్మాణంలో నిలిచిపోయిన లైబ్రరీని త్వరలోనే పనులు ప్రారంభించే విధంగా చేయనున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. పట్టణంలోని మధ్యనగర్‌లో ప్రమాదవశాత్తూ కరెంటు స్తంభం నుంచి పడిపోయి మంచాన పడిన రామకృష్ణను మంత్రి సుభాష్ పరామర్శించి పూర్తి స్థాయిలో ఆదుకుంటామని తెలిపారు. కాగా మధ్యనగర్ లోనే అనారోగ్యంతో బాధపడుతున్న పెమ్మి రాజ్ కుమార్‌ను పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇటీవల భారీ వర్షాలకు ముచ్చుమిల్లి వంతెన పరిసరాల్లో లోతట్టు ప్రాంతాలను పరిశీలించి తక్షణమే వర్షపు నీరు తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి సుభాష్ ఆదేశించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్, నారపురెడ్డి బలరాం, కవల నానాజీ, పార్టీ నేతలు చందమామ వాసు పాల్గొన్నారు.

బ్లూ కోట్ కానిస్టేబుల్‌గా నాగముని



బ్లూకోట్‌లో కానిస్టేబుల్ నాగముని

మండపేట: రాష్ట్ర పోలీస్ మాన్యువల్ ప్రకారం మండపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో బ్లూకోట్ కానిస్టేబుల్‌గా నాగముని (పీసీ 3645)ని నియమించారని టౌన్ ఎస్‌ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. నాగముని బ్లూ కోట్‌లో పగలు టౌన్‌లో గస్తీ నిర్వహిస్తూ మహిళల రక్షణకు పాటు పడతారన్నారు. పట్టణంలో మహిళలపైన, విద్యార్థినుల పైనా దాడులు జరగకుండా గస్తీ తిరుగుతారన్నారు. అలాగే వీఐపీల ప్రోటోకాల్ బాధ్యత కూడా ఆయనదేనని చెప్పారు.

తల్లిపాలలో రోగ నిరోధక శక్తి



నాగులచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు



రాయవరం మండలం వెదురుపాకలో తల్లిపాల వారోత్సవాలు



మండపేట మండలం ఏడిదలో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎంలు

కపిలేశ్వరపురం: మండలంలోని నాగుల చెరువు గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురుపాకలో..

రాయవరం: తల్లిపాలలో ఉండే రోగ నిరోధక శక్తి యాంటీ బయెటిక్స్‌లా పని చేస్తాయని పలువురు పేర్కొన్నారు. వెదురుపాకలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ నెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకూ తల్లిపాల ప్రాధాన్యతను తెలియ జేసేందుకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు హెల్త్ ఎడ్యుకేటర్ ఎ.సరోజిని తెలిపారు. బిడ్డ పుట్టిన గంట లోపు ముర్రుపాలు ఇవ్వడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రాజు, ఏఎన్‌ఎం కె.మణికుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఏడిదలో..

మండపేట: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని ఏడిద గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ గ్రామంలోని 247వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తల్లీబిడ్డలను సమావేశ పరిచి తల్లిపాల విశిష్టతను వివరించారు. పుట్టిన బిడ్డకు మొట్టమొదటి టీకా తల్లిపాలని క్రమం తప్పకుండా శిశువులకు తల్లిపాలు పట్టిస్తేనే శ్రేష్టమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏఎం సురేష్, ఏఎన్‌ఎం జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్. భారతి, నందిని, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

1న మండపేటలో కాపు ప్రజాప్రతినిధులకు సన్మానం

రాయవరం: కాపునాడు సమావేశాన్ని సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 10 గంటలకు మండపేట పట్టణంలోని సూర్య ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఐక్య కాపునాడు అధ్యక్షుడు వాదా ప్రసాదరావు తెలిపారు. రాయవరంలో శనివారం అన్ని పార్టీల కాపు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కాపు ప్రజాప్రతినిధులను పార్టీలకు అతీతంగా సత్కరిస్తామన్నారు. కాపుల ఐక్యత చాటేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కాపునాడు ఐక్య వేదిక కార్య నిర్వాహక అధ్యక్షుడు గాదంశెట్టి కొండలరావు, కాపు యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు దేవు శ్రీను, కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న వెంకటరమణతదితరులు పాల్గొన్నారు.